క్లుప్తంగా

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..

బొబ్బిలి రూరల్: మండలంలోని జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకానికి ఎంపికైన సిహెచ్ బొడ్డవలస పంచాయతీ పరిధిలో ఉన్న నిమ్మలపాడు గిరిజన గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీఓ పి.రవికుమార్ అన్నారు. నిమ్మలపాడు గ్రామంలో గురువారం ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, విద్య, వైద్యం, రోడ్లు, కాలువలను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. గ్రామంలో ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీగా గెలిపించండి

బొబ్బిలి రూరల్: పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న తనను గెలిపించాలని విజయగౌరి ఓటర్లను అభ్యర్థించారు. త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరి మండలంలోని నారశింహునిపేట జెడ్పీహెచ్ స్కూల్‌లో గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణల పేరుతో నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తనకు ఓ అవకాశం కల్పించాలని అభ్యర్థిచారు. అనంతరం ఎన్నికల కరపత్రాలను పంచి పెట్టారు. ఆమె మద్దతుదారులు ప్రసన్నకుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అరుదైన కళలను బతికించుకోవాలి



శంకరరావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొబ్బిలి: భామా కలాపం కళా రూపాన్ని నేటికీ మన ప్రాంతంలో బతికించుకుంటూ జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లో ప్రదర్శన ఇచ్చేందుకు ఆహ్వానం అందుకున్న కోమటిపల్లికి చెందిన బొంతలకోటి శంకరరావు అభినందనీయులని మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రియాజ్‌ఖాన్, తెర్లాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు అన్నారు. బొంతలకోటి శంకరరావు సత్యభామ వేషంలో భామా కలాపం ప్రదర్శనకు హైదరాబాద్ వెళ్లనున్న సందర్భంగా ఆయనను వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణంలో ఘనంగా సత్కరించారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమా..!

బొబ్బిలి: గత ప్రభుత్వ హయాంలో పేద బిడ్డలకు ఇంగ్లిష్ మీడియం చదువులు చెప్పించి అనేక సౌకర్యాలు కల్పిస్తే నేడు కూటమి ప్రభుత్వం వచ్చి తెలుగులో పరీక్షలు రాసుకోండని అనడం సరికాదని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇంగ్లిష్ మీడియానికి తెలుగు విద్యార్థులు అలవాటు పడుతున్న సమయంలో ఇలా మళ్లీ తెలుగులో రాయాలనడం వారి అభివృద్ధికి ఆటంకం అనే చెప్పాలన్నారు. ధనిక కుటుంబాల పిల్లలకే కాదు పేదింటి పిల్లలకు కూడా ఇంగ్లిష్ మీడియం ద్వారా పోటీ పరీక్షలు, ఉన్నత చదువులు లభించాలన్న గత ప్రభుత్వ ఆకాంక్షకు గండి కొట్టడానికా ఆ ఆదేశాలని ఆయన విమర్శించారు.

అపార్ నమోదు వేగవంతం చేయండి : ఆర్‌ఐఓ



గాయత్రి జూనియర్ కళాశాలలో సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్‌ఐఓ ఆదినారాయణ

రాజాం సిటీ: కళాశాలల్లో నత్తనడకన సాగుతున్న అపార్ నమోదును వేగవంతం చేయాలని ఆర్‌ఐఓ ఎం.ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని చైతన్య, గాయత్రి, ఎస్ఎస్ఎస్, శ్రీ ఆదిత్య, రామా జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. అక్కడ చేపడుతున్న అపార్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు సమావేశాల ద్వారా తెలియజేసినప్పటికీ ఎవరూ స్పందించకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల నుంచి సమాచారం సేకరించి త్వరితగతిన పెండింగ్‌లను పూర్తి చేయాలని సూచించారు.

పల్లె పండగ పనుల్లో భీమవరం ఫస్ట్

బాడంగి: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పల్లె పండగపేరుతో మంజూరైన సీసీ రోడ్డు పనులు, కాల్వ పనుల్లో భీమవరం పంచాయతీ ముందంజలో ఉందని పీఆర్ ఏఈ రమేష్ గురువారం తెలిపారు. ఈ పంచాయతీలో 18.70 లక్షలతో 9 పనులు మంజూరవ్వగా వీటిలో 7పనులు పూర్తయినట్లు చెప్పారు. వీటిలో చిన భీమవరంలో ఎస్టీ కాలనీలో సీసీరొడ్లు కాల్వలు, ఎస్టీ వీధినుంచి సాగునీటి కాల్వ వరకు సీసీ రోడ్డు పనులు, భీమవరంలో సీసీ రోడ్లు కాల్వలున్నాయన్నారు. కోటిపల్లిలో రూ.15లక్షలతో 5పనులు మంజూరవ్వగా సీసీ రోడ్డుపని పూర్తయినట్టు చెప్పారు. మండలం మొత్తంగా 6లక్షల 61వేల రూపాయలతో 89 పనులు మంజూరవ్వగా 76పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. వీటిని జనవరి మొదటి వారంలోగా పూర్తి చేస్తామన్నారు.

ప్రైవేటు ఏజెన్సీలకు ప్రభుత్వ సేవలు

- ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయాలు
- సచివాలయ ఉద్యోగులకు ఇతర పనులు
- కూటమి పాలనతో ప్రజలకు మళ్లీ అవస్థలు



వెలవెలబోతున్న రాజాం మున్సిపాల్టీలోని సత్యన్నారాయణపురం సచివాలయం



ఖాళీగా రాజాం మండలం రాజయ్యపేట గ్రామ సచివాలయం

రాజాం : గ్రామ సచివాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ స్వరాజ్య పాలనలో భాగంగా గ్రామ సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసింది. గ్రామాల్లో సచివాలయాలను నిర్మించడంతో పాటు అన్ని రకాల సేవలను ప్రజల ఇంట ముంగిటకు వచ్చేలా 10 నుంచి 12 మంది ఉద్యోగులను నియమించింది. వ్యవసాయ, పశు సంవర్థక, విద్య, వైద్య, పరిపాలన శాఖలకు సంబంధించిన కార్యదర్శులను నియమించింది. ఈ ఉద్యోగులు సచివాలయాల్లో ఉంటూ ప్రజలకు అవసరమైన సేవలతో పాటు సకాలంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు నుంచి ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు వరకూ 500లకు పైగా సేవలను అందించేవారు. వీరికి తోడు గ్రామ, వార్డు వలంటీర్లు గ్రామాల్లోని సమాచారాన్ని సచివాలయాలకు చేరవేయడం, ప్రభుత్వ పథకాలను సచివాలయాలకు అందించడం చేసేవారు.

ఇప్పుడు అంతా ప్రైవేట్ ఏజెన్సీలకు..

గతంలో సచివాలయాల ద్వారా అందించే సేవలు ప్రస్తుతం సచివాలయాల్లో నిలిచాయి. గ్రామ, వార్డు వలంటీర్ల సేవలు సచివాలయ ఉద్యోగులు చేయాల్సి వస్తుంది. ఇవే కాకుండా ఇతర సర్వేలు, పర్యవేక్షణ పనులు సచివాలయ ఉద్యోగులకు కట్టబెట్టారు. ప్రజలకు ఇంటి వద్ద అందే సేవలు ప్రైవేట్ నెట్‌వర్క్‌లకు, ఏజెన్సీలకు అప్పగించారు. ఫలితంగా గతంలో సచివాలయాల్లో మాత్రమే దరఖాస్తు చేయాల్సిన ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు, 1బీల అప్లికేషన్స్ వంటివి ఇప్పుడు బయట మీ సేవా కేంద్రాలు, ఈ నెట్ వర్క్ సెంటర్లలో అందుబాటులోకి వచ్చాయి. సచివాలయాలకు వెళ్లాల్సిన ప్రజలు దగ్గర్లోని ప్రైవేట్ నెట్‌వర్క్ సెంటర్లు వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవడంతో పాటు వాటిని పొందేందుకు మండల కేంద్రాల్లోని రెవెన్యూ కార్యాలయాలు, పరిషత్ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉండాల్సిన ఉద్యోగులు ఇతర సేవలు నిమిత్తం బయట తిరుగుతున్నారు. ప్రస్తుతం సచివాలయ సేవలు 370కు కుదించేసారు.

హామీలు అమలు శూన్యం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తామని మాట ఇచ్చారు. గతంలో రాజీనామా చేసిన వలంటీర్లను పూర్తిగా తొలగించగా, రిజైన్ చేయకుండా టీడీపీకి అనుకూలంగా పని చేసిన వలంటీర్లకు సైతం ప్రస్తుతం ఉద్యోగాలు లేవు. సూపర్ సిక్స్ ద్వారా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తూ సచివాలయ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామన్న హామీ నీరుగారుతోంది. ప్రస్తుతం ఉన్న సచివాలయ ఉద్యోగుల్లో కొంతమందిని ఇతర శాఖలకు తరలిస్తారనే ఊహాగానాలు కూడా అధికంగా ఉన్నాయి. ఇవే కాకుండా సచివాలయాల ద్వారా చేయాల్సిన రిజిస్ట్రేషన్ ప్రక్రియలు నిలిచిపోయాయి. పలు సేవలు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం, వలంటీర్లు లేకపోవడంతో ప్రజలు ప్రైవేట్ నెట్‌వర్క్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో పంచాయతీకి రూ.1 కోటి విలువ చేసే పక్కా భవనాలను గత ప్రభుత్వం నిర్మించగా, కొన్నిచోట్ల ఈ నిర్మాణాలు పూర్తి కాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ నిర్మాణాలు పూర్తిగా విస్మరిస్తోంది. రైతు సేవా కేంద్రాలైతే కొన్ని ప్రాంతాల్లో తెరుచోని పరిస్థితి ఉంది. కొంతమంది సచివాలయ ఉద్యోగులకు సుదూర ప్రాంతాలకు బదిలీ చేసి, ఇబ్బందులు పెట్టే పరిస్థితి కనిపిస్తుంది. దీంతో గతంలో కళకళలాడే సచివాలయ కార్యాలయాలు, అందులోని ఉద్యోగులు ప్రస్తుతం బిక్కుబిక్కుమంటూ బిక్కమొహంతో కనిపిస్తున్నారు.

సేవలు యధాతథం



గ్రామ సచివాలయ సేవలు గతంలో మాదిరి గానే అందిస్తున్నాం. కొన్ని రకాల సేవలు ప్రైవేట్ నెట్ సెంటర్లు చేసుకునే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఎక్కువమంది మీ సేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా సచివాలయాలకు డిమాండ్ తగ్గింది. సచివాలయ ఉద్యోగులకు మాత్రం పూర్తి స్థాయిలో తమత మ శాఖల విధులు కొనసాగించేలా చేస్తున్నాం.

– వి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, రాజాం

అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: అసెంబ్లీ సమావేశాల సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఆయన మంత్రులు గత ప్రభుత్వంపై అబద్ధాలు, నిందలు వేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మండిపడ్డారు. మండల పార్టీ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అప్పులపై చంద్రబాబు ఒక మాట, మంత్రులు ఒక్కొక్కరూ ఒక్కోలా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా.. ప్రజా సమస్యలను పక్కనపెట్టి గత ప్రభుత్వంపై దుష్ప్రచారానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రజలు నిలదీస్తారనే భయంతో వారి కోపాన్ని డైవర్షన్ చేసేందుకు అసెంబ్లీ సమావేశాల్లో అబద్ధపు మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీలను అమలు చేయకుండా పిల్లలను, మహిళలను, నిరుద్యోగులను మోసగిస్తున్నారని ధ్వజమెత్తారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నత ఆశయంతో పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే విద్యా సంస్కరణలు తీసుకొస్తే ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం వాటిని ఒక్కొక్కటిగా అటకెక్కిస్తున్నారని విమర్శించారు. పంటల బీమా గాలికొదిలేశారని, రైతులకు రూ.20 వేలు ఇస్తామని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. మరో వైపు తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకీ రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల్లో చెప్పిన టీడీపీ తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయులు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు, కనిమెరక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికానికి ఆదిగురువు విశ్వనాధ గురుస్వామి



దుప్పట్లను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: బొబ్బిలి ప్రాంతంలో అయ్యప్ప దీక్షా ధారణతో ఆధ్యాత్మికాన్ని ప్రజలకు అలవాటు చేసిన విశ్వనాథ గురుస్వామి ఆదిగురువుగా పేరొందారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. గురువారం విశ్వనాథ గురుస్వామి వర్ధంతి సందర్భంగా గురుస్వామి కాజా వేణుగోపాలరావు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శంబంగి వెంకట చిన అప్పలనాయుడు చేతుల మీదుగా దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో కింతలి అనంతరావు, కె.మల్లి, కె.వెంకటరమణ, జి.సూర్యనారాయణ, విష్ణు, శంకరరావు, వెంకటరావు, పలువురు అయ్యప్ప దీక్షాధారులు, వృద్ధులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై తస్మాత్..: డీఎస్పీ



సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ నారాయణరావుతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట నిఘా వేస్తున్నామన్నారు. రామభద్రపురం మండల కేంద్రం అంతర్రాష్ట్ర కూడలి కావడంతో నిఘా పెంచామన్నారు. జాతీయ రహదారులపై అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. వారి వెంట ఎస్ఐ వి.ప్రసాదరావు ఉన్నారు. – రామభద్రపురం

ప్రకృతి సోయగం కాదు... పేరుకుపోయిన నాచు



ఈ చిత్రం చూసి ప్రకృతి సోయగం అనుకొని ఉంటే పొరబడినట్టే.. రేగిడి మండలం పెద్దకోడిశ గ్రామంలో ఊర చెరువులో పేరుకుపోయిన నాచు ఇలా పసుపు రంగును సంతరించుకొని ప్రమాదకరంగా మారింది. లోతుగా ఉండే ఈ చెరువులో పొరపాటున దిగితే ప్రమాదమే.. చెరువును బాగు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. – రేగిడి

తగ్గించిన పాల ధరను పెంచాలి



విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాల ధరను పెంచాలని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మర్రాపు సూర్యనారాయణ డిమాండు చేశారు. స్థానిక విశాఖ డెయిరీ వద్ద రైతు సంఘం నాయకులతో కలిసి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవు పాల ధరను లీటరుకు రూ.3 నుంచి రూ.4 తగ్గించిందని, ఈ చర్యలు వలన రోజుకు పాడి రైతులు రూ.20 లక్షలు నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే పాడి రైతుకు పాలు గిట్టుబాటు కావడం లేదని వారు గగ్గోలు పెడుతుంటే ఈ పరిస్థితుల్లో పాల ధర తగ్గించడం అన్యాయమన్నారు. డెయిరీ యాజమాన్యం పాల ధర పెంచకుంటే డిసెంబరు 2వ తేదీన విశాఖ డెయిరీ ముట్టడికి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు రాంబాబు, జిల్లా సభ్యుడు ఎస్.గోపాలం, మండల నాయుకులు బలస శ్రీనివాసరావు, లెంక ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. – రామభద్రపురం

పనివేళల పెంపు సరికాదు : యూటీఎఫ్

వంగర: పాఠశాలల పనివేళలు పెంపు ఉత్తర్వులు ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు అన్నారు. మండల పరిధి అరసాడ ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభకు హాజరై మాట్లాడారు. సైకిళ్లు, కాలినడకన కిలోమీటర్లు మేర ప్రతీ రోజు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి వస్తుంటారని, చీకటి పడితే వారికి సరైన భద్రత ఉండదని అన్నారు. మధ్యాహ్న భోజనం వేళలు మార్పుతో విద్యార్థులకు ఆరోగ్యపరమైన సమస్యలొస్తాయని, తక్షణమే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా మర్రాపు ప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా సీర అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా పెంకి గౌరీశంకరరావు, ఉపాధ్యక్షులుగా బలగ ప్రసాద్, మహిళా ఉపాధ్యక్షులుగా పక్కి జ్యోతి, కోశాధికారిగా బోనుమద్దెల శ్రీనివాసరావు, పలువురు మండల కమిటీ, జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి చర్యలు

వంగర: ఉపాధ్యాయులు సర్వీసుపరంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎందువ రామకృష్ణ, పట్నాయకుని శ్రీకర్ అన్నారు. ఉపాధ్యాయులు సమస్యలుంటే మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని వెల్లడించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతివ్వాలని పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ నాయకులు లెంక రామకృష్ణ, పి.దుర్గారావు, బి.ఉమామహేశ్వరరావు, ఎం.గోవిందరావు, జి.ఠాగూర్, వి.గోవిందరావు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలతోనే బీజేపీ పాలన



పోస్టర్ల ఆవిష్కరణలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

బొబ్బిలి: పేద, మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలన్న తేడా లేకుండా ఆర్థిక భారాలు వేస్తున్న బీజేపీ పాలన నియంతృత్వ ధోరణిలో ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో శంఖారావం నిరసనల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ విడుదల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులపై ఆర్థిక భారాలు వేస్తున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, ఎరువుల ధరలను పెంచి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజల నడ్డి విరుస్తున్న ప్రధాని మోదీ గత పదేళ్లలో కార్పొరేట్ సంస్థలకు రూ.19.28లక్షల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. కార్మికుల హక్కులపై దాడి చేసేందుకే లేబర్ కోడ్, నల్లచట్టాలను తెచ్చారన్నారు. వీటికి నిరసనగా ఈ నెల 26న శంఖారావం పేరిట నిరసన కార్యక్రమాలను మండల, జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎం.శ్రీనివాసరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, పీసీసీ సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, పట్టణ కళాసీ సంఘ నాయకులు వై.అప్పారావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు



తెర్లాంలో గోశాలల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఉపాధి ఏపీఓ

తెర్లాం: మండలంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన గోశాలల నిర్మాణాల్లో లబ్ధిదార్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నాణ్యత లోపిస్తే సహించేది లేదని మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ సుశీల అన్నారు. తెర్లాంలో జరుగుతున్న గోశాలల నిర్మాణ పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం గోశాలల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేసిందని తెలిపారు. వాటి పనుల్లో ఎటువంటి నాణ్యతా లోపం లేకుండా రైతులు, లబ్ధిదార్లు నిర్మించాలని సూచించారు. కొలతల ప్రకారం నిర్మాణాలు చేపట్టకపోయినా, నాణ్యత లోపించినా బిల్లుల చెల్లింపులు చేసేదిలేదని అన్నారు.

నేడు యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

తెర్లాం: స్థానిక వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.మునిస్వామి, శంకరరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఏర్పాటైన 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, మండలంలోని యూటీఎఫ్‌కు చెందిన ఉపాధ్యాయులంతా హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు.

మండల సమావేశం రేపు

రాజాం : మండల సమావేశం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

రేగిడి : మండలంలో రేగిడి, లక్ష్మీపురం, ఆడవరం, మంగళాపేట, ఆమదాలవలస గ్రామాల్లో త్రైత సిద్ధాంతంపై గురువారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాకుళం సభ్యులు సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో భగవద్గీతపై ప్రచారం చేసారు. కార్తీకంలో దీపాలు వెలిగించడం వెనుక జ్ఞానాన్ని తెలుసుకోవాలని వెల్లడించారు.

ఆధ్యాత్మిక భావనను అలవాటుచేసుకోవాలి

రాజాం : ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావనను అలవాటు చేసుకోవాలని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. మండలంలో గడిముడిదాం గ్రామంలో సత్యసాయి 99వ జయంతి వేడుకల్లో భాగంగా పలు కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. రాజాం పట్టణం బాబానగర్‌లోని శివం మందిరం సత్యసాయి భక్తులు ఈ సందర్భంగా గ్రామంలో తొలుత సత్యసాయి పల్లకితో నగర సంకీర్తన నిర్వహించారు. బాలల స్కూల్ సందర్శన చేపట్టి, బాల వికాస్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. సత్యసాయి శివం మందిరం అధ్యక్షులు కె.రాజగోపాలరావు, కన్వీనర్ ఏవీ ఆచారి, వైఎస్సార్ సీపీ రాజాం మండల అధ్యక్షులు లావేటి రాజగోపాలనాయుడు, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో మండల స్థాయి పోటీలు

రేగిడి : మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ నెల 26న జరుగనున్న జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగ విశిష్టతపై ఈ పోటీలు జరిగాయని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ. 8 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం



శ్యాంపురంలో సీసీ డ్రైన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రాజాం : మండలంలో శ్యాంపురం గ్రామంలో రూ.8 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం చేపట్టారు. గురువారం ఈ పనులను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

భూ సమస్యలపై 1598 దరఖాస్తులు

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించిన రెవెన్యూ గ్రామసభల్లో 1598 ధరఖాస్తులొచ్చాయని ఆర్ఎస్‌డీటీ శివన్నాయుడు, సర్వేయర్ సతీష్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వారు విలేకరుతో మాట్లాడారు. అక్టోబరు 18 నుంచి నవంబరు 19వరకు గ్రామ సభలు నిర్వహించామన్నారు. ఇప్పటివరకు 44 రెవెన్యూ గ్రామాల్లో 27 గ్రామసభలను నిర్వహించామన్నారు. ఈ సభల ద్వారా ఉమ్మడి భూసమస్యలు, విస్తీర్ణం, ఫోన్ నంబరు లేకపోవడం, సరిహద్దు వంటి సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. త్వరలో వీటిని పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రమాదకరంగా రహదారి



గోతులమయంగా ఉన్న రహదారి

రేగిడి : మండలంలో ఉంగరాడమెట్ట – వన్నలి గ్రామాల మధ్య ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఇసుక లారీలు తిరగడంతో ఈ రోడ్డు గోతులమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతాల మధ్య గోతులు లేని రోడ్డును వేయాలని స్థానికులు కోరుతున్నారు. సంతకవిటి, రేగిడి, పాలకొండ, రాజాం మండలాలకు ఈ రహదారి ప్రధాన అనుసంధాన రహదారిగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

సమాచారం అందించాలి

సంతకవిటి: మహిళా కానిస్టేబుళ్లు గ్రామాలపై పూర్తి నిఘా ఉంచి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఆర్.గోపాలరావుతో కలిసి మహిళా కానిస్టేబుళ్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో కదలికలపై నిఘా ఉంచాలన్నారు.

భక్తి శ్రద్ధలతో దీపోత్సవం

సంతకవిటి: సత్యసాయిబాబా మందిరంలో గురువారం దీపోత్సవం నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు.

పీఆర్ ఈఈగా రమణమూర్తి

బొబ్బిలి: బొబ్బిలి డివిజన్ పంచాయతీరాజ్ ఈఈగా టీవీ రమణమూర్తి గురువారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈయన చీపురుపల్లిలో పీఆర్ డీఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులు, బిల్లుల చెల్లింపు, ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారిస్తానన్నారు. ఈఈగా బాధ్యతలు చేపట్టిన రమణమూర్తికి డీఈఈ సీహెచ్‌వి అప్పారావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వంగర: మండలంలోని వివిధ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సాంబశివరావు తెలిపారు. రేగిడి మండలం కాగితాపల్లి నుంచి వంగర సబ్‌స్టేషన్ వరకు విద్యుత్‌లైన్‌ను ఆనుకొని చెట్లు కొమ్మలు తొలగింపు చర్యలు చేపడతామని తెలిపారు. ఎం.సీతారాంపురం ఫీడర్ పరిధిలో చినరాజులగుమ్మడ, పెదరాజులగుమ్మడ, జేకేగుమ్మ, వీవీఆర్‌పేట గ్రామాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిచిపోతుందని, సహకరించాలని కోరారు.

అన్నసమారాధన

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం విశేష అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అన్నసమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా భవానీ భక్తులు సమర్పించిన ఇరుముడి బియ్యాన్ని భక్తులకు ప్రసాదంగా తయారుచేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, ఈఓ పి.శ్యామలరావు, దాసరి అప్పారావు, కూరాడ వెంకటరావు, స్కౌట్స్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

సత్యసాయి జయంతి వారోత్సవాలు

బొబ్బిలి: నవంబర్ 23న పుట్టపర్తి శ్రీ సత్యసాయి జయంతి సందర్భంగా పట్టణంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో సత్యసాయి 99వ జయంతి సందర్భంగా 99మంది పేదలకు అమృత కలశం పేరుతా నిత్యావసరాలు, దుప్పట్లు, చీరెలు పంపిణీ చేశారు. ముందుగా సత్యాసాయి భజన కీర్తనలు ఆలపించారు. సత్యసాయి మందిరాన్ని సుందరంగా అలంకరించి భజన కీర్తనలు ఆలపించారు. సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

రేగిడి : రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేసుకుంటే పెట్టుబడి తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ రీజనల్ కోఆర్డినేటర్‌లు ప్రకాష్, హేమ సుందర్ అన్నారు. మండలంలో గుళ్లపాడు గ్రామంలో దార్లపూడి రవి సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంటకోత ప్రయోగం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎకరాకు 35 బస్తాల ధాన్యం దిగుబడి ప్రకృతి వ్యవసాయంలో వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రేగిడి మండల ఏఓ జి.మురళీకృష్ణ, దార్లపూడి రవి, ఎన్ఎఫ్ ఎ.శంకర్, వీఏఏ మహేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు రేపు

బొబ్బిలి: ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఇంటర్ పాసైన(సైన్స్ గ్రూప్) విద్యార్థినిలకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చల్లా వీరేంద్రకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూల్లో పాల్గొనేందుకు 2023 – 24విద్యా సంవత్సరంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్, ఆధార్, మూడు సెట్ల పాస్‌పోర్టు ఫొటోలు తీసుకుని ఆ రోజు ఉదయం 9 గంటలకు కళాశాలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు పరవాడ, అనకాపల్లి ప్రాంతాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.13వేల వేతనంతో పాటు వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఉన్నత విద్యనభ్యసించేందుకు కూడా అవకాశం కల్పిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రిజిస్టర్ చేసుకునేందుకు 89191 82007, 93470 55910నంబర్లను సంప్రదించాలన్నారు.